క్లుప్తంగా

పీహెచ్‌సీకి వాటర్ కూలర్ బహూకరణ



వాటర్ కూరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బంగారు వ్యాపారి తేజ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీకి గ్రామానికే చెందిన అంబికా జ్యూయలర్స్ అధినేత తేజ వాటర్ కూలర్ బహూకరించారు. ఆసుపత్రిలోని వైద్యులు, రోగుల అవసరం మేరకు చల్లని నీరు, వేడి నీరు అందించే కూలర్‌ను అందించినందుకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.సందీప్ నాయుడు, డాక్టర్ బి.అలేఖ్య, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జగన్నాయకులపాలెం మాజీ సర్పంచ్ చవ్వాకుల సూర్య భాస్కరరావు ఆసుపత్రికి పరుపు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వీరవేణి, ఎంపీహెచ్ఈఓ గోవిందబాబు, హెచ్‌ఎస్ గంగాధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సమావేశాలు

రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వైఎస్సార్ ఆసరా సమావేశాలు నిర్వహిస్తామని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాజర్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఎంపీడీవో డి.శ్రీనివాసు పర్యవేక్షణలో వెంటూరు, చెల్లూరు, పసలపూడి, మాచవరం గ్రామాల్లో నిర్వహించే ఈ సమావేశాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాలకు వెంటూరులో, 10 గంటలకు చెల్లూరులో, మధ్యాహ్నం రెండు గంటలకు పసలపూడిలో, మూడు గంటలకు మాచవరం గ్రామాల్లో ఈ సమావేశాలను నిర్వహించనున్నట్లు వివరించారు. నాలుగు గ్రామాల్లోని 892 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ మూడో విడత కింద రూ.7.89 కోట్ల లబ్ధి చేకూరినట్లు తెలిపారు.

ఎంపీటీసీ ప్రసన్నకు ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న వాకతిప్ప ఎంపీటీసీ సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్‌ను బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. అంగరలో పితృ వియోగంతో బాధపడుతున్న రావూరి ఆంజనేయులు, వెంకటకృష్ణలను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కవల శ్రీను, సంకాబత్తుల స్వామి కాపు, పాలింగి శ్రీను, అడబాల శ్రీను ఉన్నారు.

వెదురుమూడి ఘటనకు మాజీ ఎమ్మెల్సీ ఖండన

కపిలేశ్వరపురం: వెదురుమూడిలో జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని తొలగించడాన్ని తాను ఖండిస్తున్నానని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. పూలే విగ్రహ వివాద ఘటనా స్థలాన్ని బుధవారం ఆయన సందర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సిబ్బంది విగ్రహాన్ని తొలగిస్తుండగా అడ్డుకున్నవారిపై పోలీసులు కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఘటనపై న్యాయాన్యాయాలపై స్పందించాలన్నారు. సమస్యపై స్పందించాల్సిన బాధ్యత బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తోట త్రిమూర్తులుపై ఉందని సుబ్రహ్మణ్యం అన్నారు. కాగా ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ నాయకులు రెడ్డి ప్రసాద్ సందర్శించారు.

చోరీ కేసులో ముద్దాయిలకు జైలు

రాయవరం: మాచవరంలో రెండేళ్ల క్రితం జరిగిన చోరీ ఘటనలో ముద్దాయిలకు న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు. వివరాలు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. మాచవరంలోని కొరిపెల్ల సూర్యకాంతం ఇంట్లో 2021 జనవరి 7న గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలకొట్టి 30 గ్రాముల బంగారం, రూ.1.30 లక్షల నగదు చోరీ చేశారు. అప్పట్లో ఈ కేసును ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా, ఎస్సై ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. విచారణ అనంతరం మండపేట రూరల్ సీఐ పి.శివగణేష్ నిందితులు తోటకూర రామకృష్ణంరాజు, సుద్దాల కుమార్‌రాజా, విజయతవార్‌పవార్ అనే వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 30 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. అనపర్తి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో వాదోపవాదనల అనంతరం మేజిస్ట్రేట్ పి.చైతన్య నిందితులపై నేరారోపణలు రుజువైనందున ముద్దాయిలకు ఒక్కొక్కరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు.

గాయపర్చిన ముగ్గురిపై కేసు

అయినవిల్లి: అక్కతమ్ముళ్లను గాయపర్చిన ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఎస్.పెదపాలెంలో మంగళవారం రాత్రి బొక్కా లక్ష్మణరావు, చక్రవర్తి, రామకృష్ణలు గొడవపడుతున్నారు. రాత్రి సమయంలో గొడవ లేంటని సానబోయిన ఉమాలక్ష్మి, ఆమె సోదరుడు ముషిణి ఈశ్వరరావు అడిగారు. దీంతో ఆగ్రహించిన ఆ ముగ్గురూ ఉమాలక్ష్మి, ఈశ్వరరావులను గాయపరిచారు. దీనిపై ఉమాలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లెలకు ఆరోగ్య రక్ష

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమాల నిర్వహణ

కె.గంగవరం: గ్రామీణుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. మారుమూల ప్రాంతాల ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పంచాయితీ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆరోగ్యరంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు విస్తృత సేవలు అందించేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీలతో సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు.

ఆరుగురు సభ్యులతో కమిటీ..

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీహెచ్‌వో మిడ్‌లెవెల్ ప్రొవైడర్ ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ

గ్రామీణుల ఆరోగ్యంపై ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు, రక్తహీనత, పోషకాహారలోపం ఉన్నవారిని గుర్తించాలి. వారి ఆరోగ్య నివారణ చర్యలు, గ్రామీణ ప్రజల జీవనశైలి, రోగాల నివారణ, చికిత్సలపై కమిటీ అప్రమత్తంగా ఉండాలి. పాఠశాల విద్యార్థుల ఆరోగ్య వివరాలను స్కూల్‌లోనే హెల్త్ అంబాసిడర్లు పర్యవేక్షించాలి. కౌమార దశలోని బాలబాలికలకు రోజూ ఐఎఫ్ఎ మాత్రలు పంపిణీ చేయాలి. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. యుక్తవయస్సు బాలికలకు శానిటరీ ప్యాడ్స్ సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల మధ్యాహ్న భోజన వివరాలను కమిటీ లీడర్‌లకు అందించాలి. ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పిల్లల రక్తహీనతపై పర్యవేక్షణ, గర్భిణులకు ప్రసవాలకు ముందు, తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన, మందుల పంపిణీ, ఆరోగ్యసంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు అందేలా సమన్వయం చేసుకోవాలి. గ్రామాల్లో నిర్వహించే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీం లీడర్లు విధిగా హాజరయ్యేలా టీంలో ఉన్న డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. గ్రూపు సభ్యుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలి. గర్భాధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇమ్యూనైజేషన్ ద్వారా రోగ నిరోధకతను పెంచడం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి. బాల్యవివాహాలను నివారించడంతో పాటు యుక్తవయస్సులో గర్భాధారణను నిరోధించాలి. ప్రతి శుక్రవారం డ్రై డే, పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఉంటుంది.



అముజూరులో పేదలకు వైద్యం చేస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ టీం సభ్యులు

ప్రజలకు ఎంతో ఉపయోగం



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్‌అటాక్, కాన్సర్ తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

– మాణిక్యం, పీహెచ్‌సీ వైద్యులు, పామర్రు

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తాం. సంపూర్ణ ఆరోగ్యం దిశగా పల్లెలను తీర్చిదిద్దుతాం, ఈ కమిటీల ఏర్పాటు ద్వారా గ్రామీణ ఆరోగ్య సమస్యను పరిష్కరించవచ్చు. ఆరోగ్య పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించేందుకు చర్యలు చేపడతాం.

– ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.గంగవరం

హీరో మహేష్‌బాబు మేలును మరువలేం



చిన్నారికి పండ్లు అందజేస్తున్న మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు

మండపేట: తమ కుటుంబానికి ప్రముఖ సినీ హీరో మహేష్‌బాబు చేసిన మరువలేమని పట్టణంలోని 8వ వార్డుకు చెందిన బుంగ ఏసు, రాజకుమారి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వీరి నాలుగేళ్ల చిన్నారిని వైద్యులకు చూపించగా గుండెకు రంధ్రం ఉందని, ఆపరేషన్‌కు రూ.ఐదు లక్షల వరకూ ఖర్చవుతుందని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన ఏసు ఆపరేషన్ చేయించే స్తోమత లేకపోవడంతో మండపేట టౌన్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు మెండు సత్తిబాబును సంప్రదించారు. చిన్నారికి వచ్చిన కష్టం గూర్చి సత్తిబాబు కాకినాడలోని మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌కు వివరించారు. ఈ విషయాన్ని మహేష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి చిన్నారికి విజయవాడలో ఆపరేషన్ చేయించారు. ఇప్పుడు తమ పాప పూర్తి ఆరోగ్యంతో కోలుకుందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు చిన్నారి ఇంటికి వెళ్లి పండ్లు అందజేశారు. ఫ్యాన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దుగ్గిరాల రాంబాబు, ఎస్‌కేబాబ్జి, కె.సత్యనారాయణ, ముత్యాల భరణి, మెండు రవిచంద్ర, పోలుబోతు గణేష్, రగడ, బట్టా అరుణ్, తిప్పా ప్రసాద్ పాల్గొన్నారు.

మే 15 కల్లా జేవీకే కిట్లు సిద్ధం



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రాజెక్టు ప్లానింగ్ కోఆర్డినేటర్ నిరంజన్‌కుమార్

రామచంద్రపురం రూరల్: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లు మే 15 కల్లా మండలాలకు చేరుకునేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు ప్లానింగ్ కోఆర్డినేటర్ పి.నిరంజన్‌కుమార్ ఆదేశించారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం మండలాల విద్యా శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డీవైఈఓ షాలెంరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు, నోట్సు, యూనిఫామ్, బ్యాగ్, బెల్ట్, షూ, డిక్షనరీలతో కూడిన విద్యాకానుక కిట్లు మే 15 కల్లా మండలాలకు చేరుకునేలా, జూన్ 12 కల్లా పాఠశాలల్లో విద్యార్థులు వచ్చే నాటికే అందించేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం మండల స్థాయిలో మండల కమిటీలు, ఉప కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.కమల కుమారి, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్ఎస్‌సీఓ డి.రమేష్‌బాబు, ఐఈసీఓ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు, మూడు మండలాల ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు, పార్ట్ టైం టీచర్లు, ఐఈఆర్టీ టీచర్లు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: వచ్చే విద్యా సంవత్సరానికి జగనన్న విద్యా కానుకలు అందించేందుకు చర్యలను చేపట్టినట్టు జగనన్న విద్యా కానుకల పంపిణీ రాష్ట్ర ప్రణాళిక కో ఆర్డినేటర్, జిల్లా ప్రత్యేకాధికారి పి.నిరంజన్ తెలిపారు. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను ఆయన సందర్శించారు. ఎంఈఓ కె. తాతారావు, ఏపీఎం అర్జున, హెచ్ఎం అంగర రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్‌ను బుధవారం ఏపీ ప్లానింగ్ కో ఆర్డినేటర్ పి. నిరంజన్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 4900 కిట్ల అవసరమవుతాయని గుర్తించామన్నారు. వెంటనే వాటిని తయారు చేయాలని సూచించామని బ్యాగులు, బెల్ట్‌లు, షూలు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు మే నెలాఖరికి పామర్రు స్టాక్ పాయింట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అక్కడ నుంచి అన్ని పాఠశాలకు అందించి విద్యార్థులకు చేరవేస్తామని చెప్పారు. ఎంఈఓ నాగరాజు, అధికారులు బి.సుబ్రహ్మణ్యం, రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూర్తి నాణ్యతతో జేవీకే కిట్లు అందిస్తాం

- స్టోరేజ్ పాయింట్లను పరిశీలించిన నిరంజన్‌కుమార్
- మూడు మండలాల సిబ్బందితో సమీక్ష



రాయవరం ఉన్నత పాఠశాలలో స్టోరేజ్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న నిరంజన్‌కుమార్

మండపేట: జగనన్న విద్యాకానుక నాల్గో దశలో విద్యార్థులకు అందించే సామగ్రిని పూర్తిస్థాయి నాణ్యతతో అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జగనన్న విద్యాకానుక స్టోరేజ్ పాయింట్స్ జిల్లా పరిశీలకుడు నిరంజన్‌కుమార్ తెలిపారు. మండలంలోని మండపేట మండల పరిషత్ సమావేశపు హాలులో బుధవారం ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాల సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్లానింగ్ కో–ఆర్డినేటర్ నిరంజన్ కుమార్ మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకను సమర్ధవంతంగా పంపిణీ చేసే క్రమంలో భాగంగా తొలి దశలో స్టోరేజ్ పాయింట్లను ఎంపిక చేసి, వాటిని తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఈ నెల 20 నుంచి జేవీకే సామగ్రి స్టోరేజ్ పాయింట్లకు చేరుకోవడం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో రామచంద్రపురం డీవైఈవో పి.షాలెంరాజు, ఎంపీడీవో పి.రాజు, ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, కె.తాతారావు, సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. నిరంజన్‌కుమార్‌ను ఎంఈవో రామచంద్రరావు దుశ్శాలువాతో సత్కరించారు. ఆల్టర్‌నేటివ్ స్కూల్స్ జిల్లా కో–ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏఎంవో పి.రాంబాబు, మూడు మండలాల సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు పాల్గొన్నారు.

రాయవరంలో..

రాయవరం: జగనన్న విద్యాకానుక మండల స్టోరేజ్ పాయింట్‌ను రాష్ట్ర ప్లానింగ్ కో–ఆర్డినేటర్, జిల్లా పరిశీలకుడు నిరంజన్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జేవీకే స్టోరేజ్ పాయింట్‌ను తనిఖీ చేశారు.ఈ తనిఖీలో ఆయన వెంట రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.షాలెంరాజు, సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవో వై.సత్యనారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న సర్కారు లక్ష్యం



హసన్‌బాదలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో కోటిపల్లి శివాజీ, కన్వీనర్లు, గృహసారథులు



అయితపూడిలో 'జగనన్నే మా భవిష్యత్తు'లో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు పంచుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ

కాజులూరు: రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరికం లేకుండా చేయాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి నాడు–నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ పార్టీ నుంచి వచ్చిన ప్రశ్నపత్రంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాబడుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్టిక్కర్లు, కరపత్రాలు పంచారు. అయితపూడిలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ పాల్గొని మాట్లాడుతూ సంక్షేమాన్ని ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను, సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం జగన్‌ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పెనుమళ్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ కంచి ఏసునందం, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండలంలోని గ్రామగ్రామాన జగనన్నే మా భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజల నుంచి సమాచారం రాబట్టి వారి అనుమతితో ఇంటి గుమ్మానికి జగన్ స్టిక్కర్లను అతికిస్తున్నారు. మండలంలోని 26 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. కుందూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి పాల్గొని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, బీసీ నాయకులు బత్తుల అప్పారావు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హసన్‌బాదలో..

రామచంద్రపురం రూరల్: ఎన్నికల వాగ్దానాలు పూర్తిగా అమలు చేసి ప్రజల మద్దతు కోరుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం మండలంలోని హసన్‌బాదలో నూరు శాతం పూర్తయినట్లు కార్యక్రమ అబ్జర్వర్ కోటిపల్లి శివాజీ బుధవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలో ప్రజలు సీఎం జగన్ సంక్షేమ పాలనపై సంపూర్ణ మద్దతు ప్రకటించారని అన్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్న రుణం తీర్చుకుంటామని ప్రజలు తెలపడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చిందని శివాజీ అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు, గృహసారథులు ఉబే సత్యనారాయణ, సూరంపూడి శేఖర్, గోరు సత్యనారాయణ, దంగేటి సూరిబాబు, కుడుపూడి భీమన్న, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ధనమ్మతల్లి జాతర



గొల్లపాలెం ఆలయంలో వెలసిన ధనమ్మతల్లి

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం గొల్లపాలెం, కరప మండలం కొంగోడు గ్రామాల సరిహద్దులో వెలసిన ధనమహాలక్ష్మి (ధనమ్మ) అమ్మవారికి గురువారం తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహక కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. కరోనా విజృంభణ నేపథ్యంలో రెండేళ్ల జాతరలు నామమాత్రంగా జరిగాయి. రెండేళ్ల లోటును భర్తీ చేస్తూ ఈ ఏడాది మరింత వైభవంగా జాతర నిర్వహించేందుకు స్థానికులు సిద్ధమవుతున్నారు. గొల్లపాలెం, కొంగోడు గ్రామాల సరిహద్దులో వెలసిన అమ్మవారికి రెండు వందల సంత్సరాల క్రితం భక్తులు రెండు ఆలయాలను నిర్మించగా కాలక్రమేపీ అది రెండు మండలాల సరిహద్దు నుంచి రెండు నియోజకవర్గాల సరిహద్దుగా మారింది. ఇరు గ్రామాల పెద్దలు సఖ్యతతో ఒకే రోజుల ఇక్కడ అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏటా ఉగాది అనంతరం వచ్చే పౌర్ణమి తర్వాత గురువారం అమ్మవారికి తీర్థం నిర్వహిస్తుంటారు. కాకినాడ, రామచంద్రపురం, మండపేట, యానం, కోటిపల్లి తదితర ప్రాంతాల నుంచి ఏటా సుమారు 50 వేల మంది భక్తులు తీర్థ మహోత్సవాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

ట్రాఫిక్ మళ్లింపు

ధనమ్మతల్లి ఆలయాలు కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్టు గొల్లపాలెం పోలీస్టేషన్ ఎస్సై ఎస్.తులసీరామ్ తెలిపారు. వాహనాలను గొల్లపాలెం పంచాయతీ కార్యాలయం వెనుక రహదారి నుంచి కొంగోడు మీదుగా వెంకటేశ్వర స్వామి ముఖద్వారం వరకూ మళ్లిస్తున్నామన్నారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరప, గొల్లపాలెం, కొరంగి, ఇంద్రపాలెం, పోలీస్‌స్టేషన్లతో పాటు కాకినాడ నుంచి 200 మంది పోలీసు బలగాలను రప్పిస్తున్నామన్నారు.

104 సేవలు అందుబాటులోకి తీసుకురావాలి

కాజులూరు: తమ గ్రామానికి 104 వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఒంటితాడి గ్రామ సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ కోరారు. ఈ మేరకు బుధవారం దుగ్గుదుర్రు పీహెచ్‌సీలో వైద్యాధికారులను కలసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 108, 104 వైద్యసేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఒంటితాడి, ఒంటితాడి శివారు శీలలంక గ్రామాలకు నెలలో ఒకరోజు 104 వాహనం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ రుణమాఫీ చెక్కు అందజేత



డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదరికమే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కేశవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు 3వ విడత రుణమాఫీ సాయం పంపిణీ బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. పంచాయతీ సర్పంచ్ పెదపాటి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట, పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ప్రభుత్వం నేరుగా ప్రజల చెంతకే చేరవేస్తోందన్నారు. పాపారాయుడు, వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీకి రానున్న ఎన్నికల్లో భారీ విజయాన్ని అందించాలని కోరారు. ఎంపీడీఓ ఐ.రాజు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ బందెల సాయిరాం, కొప్పిరెడ్డి ప్రసాద్, పెదపాటి ఉమామహేశ్వరరావు, తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

స్పందించాల్సిన బాధ్యత నాపై ఉంది

మండపేట: నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని తన స్వగృహంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వెదురుమూడిలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం తొలగింపు వివాదం విషయమై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనను రాబంధుతో పోల్చడం ఆశ్చర్యంగా ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల ఖండించారు.

విగ్రహం తొలగింపును రాజకీయం చేస్తే సహించం

వెదురుమూడి శెట్టిబలిజ సంఘ నేతలు



వెదురుమూడిలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం: ఈ నెల11న మండలంలోని వెదురుమూడిలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం తొలగింపు ఘటనను రాజకీయం చేస్తే సహించమని గ్రామ బీసీ సామాజిక వర్గీయులు స్పష్టం చేశారు. మండల బీసీ సామాజిక ప్రతినిధులతో కలిసి ఘటనపై గ్రామంలో బుధవారం తమ నిర్ణయాన్ని వివరించారు. గ్రామానికి చెందిన మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం కార్యదర్శి పార్థసారథి, నాయకులు అంసూరి వెంకటరమణ, గుత్తుల సత్తిబాబు మాట్లాడుతూ తమ సామాజికవర్గం వివిధ స్థాయిల్లోని ప్రతినిధుల సహాయ సహకారాలతో సమస్యను పరిష్కరించుకుంటామన్నారు. సమస్యపై తమ సంఘం మండల నాయకులు శీలం గోవింద్, మేడిశెట్టి దుర్గారావు, వాసంశెట్టి వాసు ఇప్పటికే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. పోలీసుల చర్యపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తలెత్తిన సమస్యను వివాదంగా మార్చి, రాజకీయ ప్రయోజనాలను పొందాలని చూసే కార్యాచరణలను మానుకోవాలని రాజకీయ పార్టీలను కోరుతున్నామన్నారు. ప్రశాంతతకు మారుపేరు వెదురుమూడి గ్రామమని, గతంలో ఈ తరహా ఘటనలు జరిగిన దాఖలాలు లేవన్నారు. తమ సంఘ ప్రతినిధులు ద్వారా సమస్యను పరిష్కరించుకుని త్వరితగతిన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోగలమని గ్రామ సంఘం నాయకులు చెప్పారు. గుత్తుల రామకృష్ణ, జీవీవీ సత్యనారాయణ, పితాని సూర్యచంద్రరావు, చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, గుత్తుల శివకృష్ణ, చొల్లంగి శివప్రసాద్, గుత్తుల లోవరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ పూజలు



విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్రీధర్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు పూజలు చేశారు. తొలుత ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశ్వీరాదం పలికి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ చరిత్రను వివరించారు.